
సాక్షి
బాపట్ల
శనివారం | 6 | జనవరి | 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం శుక్ర వారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన విద్యుత్ కేంద్రానికి 11,809, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



మల్లేశ్వరుడి సేవలో కార్మిక మంత్రి

తాడేపల్లి రూరల్ : పెనుమాకలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దర్శించుకున్నారు.

రేషన్ పంపిణీ



నరసరావుపేట: జిల్లాలో మంజూరైన 4,138 రైస్ కార్డులకు ఈ నెల నుంచే రేషన్ అందజేస్తున్నట్లు జేసీ ఏ.శ్యాంప్రసాద్ శుక్రవారం పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

కృషి విజ్ఞాన కేంద్రంలో ఒక్కరోజు శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: నగర శివారు లాంఫాం నందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 10న ఫ్రూట్ స్క్వాషెస్ తయారీ, 23న టమాటో, మునగ, పచ్చిమిరప, పొడులు తయారు చేసే విధానంపై ఒక్కరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు శాస్త్రవేత్త డాక్టర్ ఎం. దీప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ 500 చెల్లించాలని ఆమె సూచించారు. వివరాలకు 9959920099ను సంప్రదించాలని కోరారు.

గుంటూరు డీఎంహెచ్‌ఓగా డాక్టర్ విజయలక్ష్మి



గుంటూరు మెడికల్ : గుంటూరు డీఎంహెచ్ ఓగా డాక్టర్ కె.విజయలక్ష్మిని నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కె.పద్మావతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అడిషనల్ డీఎంహెచ్ఓగా కె.విజయలక్ష్మి ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాలలో 1985లో ఎంబీబీఎస్ చదివి 1994లో గాజువాక మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరి, ప్రభుత్వ సర్వీసులో ప్రవేశించారు. 2010లో డెప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది విశాఖపట్నం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా పనిచేశారు. సివిల్ సర్జన్‌గా 2021లో ప్రమోషన్ పొంది విజయనగరం, విశాఖపట్నం డీఎంహెచ్‌ఓగా పనిచేశారు. శనివారం విధుల్లో చేరుతున్నట్లు డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు.

9 నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

గుంటూరు ఎడ్యుకేషన్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం ఈనెల 9వ తేదీ నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం తెలిపారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు విధిగా సెలవులుగా పరిగణించాలని, ఈనెల 19న పునఃప్రారంభించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులకు ఎటువంటి తరగతులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్యాంపస్‌లను తెరిచి 10వ తరగతి విద్యార్థులకు సైతం తరగతులు నిర్వహించేందుకు వీల్లేదని ఆమె స్పష్టం చేశారు. ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు.

17లోపు అంబేడ్కర్ వర్సిటీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గుంటూరు ఎడ్యుకేషన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో జరగనున్న యూజీ ద్వితీయ, తృతీయ సెమిస్టర్ల పరీక్ష ఫీజులను ఈనెల 17లోపు చెల్లించాలని జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ స్టడీ సెంటర్ ప్రాంతీయ సమన్వయకర్త పి. గోపీచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలని, ఇతర వివరాలకు 0863-2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

26లోపు మారథాన్‌కు నమోదు చేసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా '2023-24 ఏటీఎల్ మారథాన్' జాతీయస్థాయి ఇన్నోవేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 26వ తేదీలోపు ఏటీఎల్.యూనీసాల్వ్.ఓఆర్జీ సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని డీఈవో పి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఏ. రవికుమార్‌ను 9849627708 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

యార్డులో 45,624 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 42,502 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 45,624 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.21,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 32,626 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలియజేశారు.

అర్హులందరికీ పారదర్శకంగా 'సంక్షేమం'

కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: జిల్లాలో అర్హులందరికీ పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం నవరత్నాలు ద్వైవార్షిక మంజూరు కార్యక్రమాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లు, లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ప్రజలకు తోడుగా ప్రభుత్వం నిలుస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లాలో మంజూరైన లబ్ధిదారులకు స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశంలో కలెక్టర్ రంజిత బాషా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హత ఉండి లబ్ధి పొందలేని వారందరికీ ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందని చెప్పారు. సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించే కార్యక్రమాన్ని ఏడాదికి రెండు పర్యాయాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

2,050 మందికి రూ 3.01 కోట్లు విడుదల

జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,050 మందికిగాను రూ 3.01 కోట్లు విడుదలైనట్లు కలెక్టర్ వెల్లడించారు. జగనన్న చేదోడు పథకం కింద 429 మందికి, వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం 35 మందికి, ఈబీసీ నేస్తం 218 మందికి, జగనన్న అమ్మఒడి కింద 1,127మందికి, వైఎస్సార్ మత్స్యకార భరోసా 120మందికి, వైఎస్సార్ కాపు నేస్తం 37మందికి, వైఎస్సార్ వాహన మిత్ర 56మందికి, వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాది తోఫా కింద 36మందికి నగదు మంజూరైనట్లు వివరించారు. ప్రభుత్వం కల్పించే అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సీహెచ్. కృష్ణ, డీఎల్‌డీవో సువార్త, డీఆర్‌డీఏ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి: కలెక్టర్

బాపట్ల: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. నోడల్ ఆఫీసర్ల విధులు, బాధ్యతల్ని తెలుసుకుని, ఎన్నికల సంఘం నిబంధన మేరకు పనిచేయాలని ఆయన సూచించారు. ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన సిబ్బందితో పాటు పోలీసుల్ని సిద్ధం చేయాలని డీఆర్వోను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, అదనపు ఎస్పీ మహేష్, ఆర్ అండ్ బీ ఎస్ఈ సి. శ్రీనివాస్, గనుల శాఖ ఏడీ రాజేష్ కుమార్, డీఎఫ్‌వో మాధవ నాయుడు, మత్స్య శాఖ ఏడీ సైదా, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

చంద్రబాబు పచ్చి అబద్ధాలకోరు

- ఏడుపదుల వయసు దాటినా అవే బూటకపు మాటలు
- రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఒంగోలు: ఏడు పదుల వయసు దాటినా చంద్రబాబు అబద్ధాలు మాత్రం నిస్సిగ్గుగా వల్లె వేస్తున్నారని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సలహాదారు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. కనిగిరి సభలో చంద్రబాబు చేసిన విమర్శలపై శుక్రవారం తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బత్తుల నిప్పులు చెరిగారు. వెలిగొండ ప్రాజెక్టుకు రెండు సార్లు శంకుస్థాపన చేసి పట్టుమని రూ.10 కోట్లు కూడా ఖర్చుచేయని చంద్రబాబు అది తన ఘనతే అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్, సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే వెలిగొండ పనులు వడివడిగా సాగాయనినిని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు అధికారం వెలగబెట్టిన చంద్రబాబు.. వెలిగొండ మొదటి టన్నెల్‌ను 2.5 కి.మీ కూడా తవ్వించలేక చేతులెత్తేశారని దుయ్యబట్టారు. 2019లో అధికారం చేపట్టిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రెండో సొరంగాన్ని సైతం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారని, త్వరలోనే ప్రాజెక్టును ప్రారంభించనున్న విషయం ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదంటూ పచ్చి అబద్ధాలు చెబుతున్న చంద్రబాబును రాజకీయాల నుంచి శాశ్వతంగా సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. 1.40 లక్షలకుపైగా సచివాలయ ఉద్యోగాలు, వైద్య విభాగంలో 52 వేల ఉద్యోగాలు, ఏపీపీఎస్సీ ద్వారా 3 వేలకు పైగా ఉద్యోగాలు జగన్ హయాంలో ఇచ్చారని గుర్తు చేశారు. 17 మెడికల్ కాలేజీలకు శంకుస్థాపన చేసి, తొమ్మిది కాలేజీలను ప్రారంభించారని పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో దగాపడిన



రైతులు, మహిళలను ఆదుకుని ఆర్థిక భరోసా కల్పించిన ఘనత ఆయనదేనన్నారు. చంద్రబాబు పాలనలో 30 లక్షల మందికి మాత్రమే పెన్షన్ లభించేదని, కానీ నేడు 64 లక్షల మంది పార్టీలకు అతీతంగా రూ.3 వేలు పెన్షన్ పొందుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు, ఎల్లో ముఠా నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారాలు చేస్తూ పబ్బం గడపుకొంటున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించడమే కాకుండా 22 లక్షల మందికి ఇళ్లు మంజూరు చేసిందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న 14 ఏళ్లలో ఎందరికి ఇళ్లు కట్టించారో చెప్పాలని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అన్ని రకాల పదవుల్లో ప్రాధాన్యం ఇస్తూ రాజకీయంగా ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. ఆరోగ్యశ్రీని చంద్రబాబు నిర్లక్ష్యం చేస్తే.. చికిత్సల సంఖ్య పెంచడంతోపాటు గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు ముందుకు సీఎం అవకాశం కల్పించారన్నారు. ఒంగోలులో ఆంధ్రకేసరి యూనివర్సిటీ, మార్కాపురంలో మెడికల్ కాలేజీ ఏర్పాటవుతున్నాయని తెలిపారు. చంద్రబాబుకు 2024 ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బ్రహ్మానందరెడ్డి చెప్పారు.

పరిమళించిన అర్ధ శతాబ్ది స్నేహం

చీరాల అర్బన్ : యాభై ఏళ్ల జ్ఞాపకాల్ని పరస్పరం పంచుకోవడం, ఆత్మీయంగా పలకరించుకోవడం అపురూప సన్నివేశమని విశ్రాంత డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జడ్జి ఎం.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. చీరాల మండలం వాడరేవులోని బ్రహ్మాస్ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం వీఆర్ఎస్‌వైఆర్ఎన్ డిగ్రీ కాలేజీ 1974-77 బీఏ బ్యాచ్ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సంబరాల్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు వచ్చారు. కళాశాలతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆనాటి కళాశాలలో జరిగిన కొన్ని ఘటనలు గుర్తు చేసుకున్నారు. పూర్వ అధ్యాపకుల ఆశీస్సులు తీసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ తమ అనుభవాల్ని నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ కుటుంబ సభ్యులతో కార్యక్రమానికి వచ్చి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు జ్ఞాపికలు అందించి, శాలువాలతో సత్కరించారు.



సహచరులతో విశ్రాంత జడ్జి లక్ష్మీనారాయణ

ప్రమాదంలో గ్రానైట్ కార్మికుడు మృతి

మార్టూరు: గ్రానైట్ ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి మార్టూరులో జరిగింది. ఎస్ఐ ఎం. శ్రీనివాసరావు వివరాల మేరకు.. అస్సాం రాష్ట్రానికి చెందిన రతన్ సూత్రధార్ (19) స్థానిక నాగరాజుపల్లి రోడ్డులో గల విక్టర్ అండ్ రోమియో గ్రానైట్ ఫ్యాక్టరీలో క్రేన్ ఆపరేటర్గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి క్రేన్ పైన ఉండి ముడి రాయిని కట్ చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు క్రేన్ పిల్లర్‌కు, ముడి రాయికి మధ్య ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన తోటి కార్మికులు రతన్‌ను మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో ఉంచి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్నకు అండగా ఉందాం.. ఎన్నికల్లో గెలిపిద్దాం

- దేశంలో అధిక పింఛన్లు ఇచ్చే రాష్ట్రం ఏపీనే..
- నూతన ఫించన్ల పంపిణీలో ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల: 'పాదయాత్రలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చి అన్ని వర్గాలకు అండగా నిలిచిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి అందరం అండగా నిలవాల్సిన సమయం వచ్చింది.. ప్రజలకిచ్చిన ప్రతీ హామీని అమలు చేసి, సేవ చేసే ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందిన ఆయన్ను గెలిపించి కృతజ్ఞత చాటుకోవా'లని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో శుక్రవారం మండలానికి నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరణం మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల్ని నెరవేర్చి పేదలకు అండగా నిలిచారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.3 వేల పింఛన్ ఇస్తున్న రాష్ట్రంగా ఏపీ గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. నవరత్నాల పేరుతో సంక్షేమం, అభివృద్ధిని సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రెండు కళ్లుగా చేసుకుని సంక్షేమ రాష్ట్రంగా మార్చారని వివరించారు. నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేశామన్నారు. పట్టణం, రూరల్ గ్రామాల్లో పెద్దఎత్తున పనులు చేశామని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రోజిని, ఎంపీడీవో కె.నేతాజీ, పార్టీ మండల అధ్యక్షుడు అంకాళరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ జి. శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎన్.రాజ్‌కుమార్, పార్టీ నాయకులు బి.శివపార్వతి, బి.శ్రీను, ఆజాద్, మురళి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

అమ్మ శరణం.. ముక్తికి మార్గం

మూడో రోజు కొనసాగిన దీక్షల విరమణ

- పెద్ద సంఖ్యలో తరలివస్తున్న భవానీలు
- నేడు అత్యంత కీలకం
- లక్షన్నరకు పైగా విచ్చేస్తారని అంచనా
- ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు



ప్రకాశం బ్యారేజీ మీదుగా అమ్మ దర్శనానికి వస్తున్న భవానీలు, భక్తులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): జై భవానీ.. జైజై భవానీ.. అమ్మా భవానీ.. దుర్గా భవానీ.. నీవే శరణమమ్మా.. అంటూ భవానీలు, భక్తుల శరణుఘోషతో ఇంద్రకీలాద్రి పరిసరాలు మార్మోగాయి. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న భవానీ దీక్ష విరమణ మహోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున 1 గంట నుంచి రాత్రి 11.30 గంటల వరకు సుమారు 60 వేల మంది భవానీలు అమ్మవారిని దర్శించుకుని ఇరుముడులను సమర్పించారు. గురువారం సాయంత్రం నుంచి గిరి ప్రదక్షిణ చేపట్టిన భవానీలు శుక్రవారం రాత్రి క్యూలైన్‌లోకి చేరుకుని తెల్లవారుజామున అమ్మవారిని దర్శించుకుని ఇరుముడులను సమర్పించారు. దీంతో శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారి ఆలయ పరిసరాలన్నీ భవానీలతో కిటకిటలాడాయి. భవానీలతో పాటు శుక్రవారం నేపథ్యంలో సాధారణ భక్తులు సైతం క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు.

నిరంతరం ఉచిత ప్రసాద వితరణలు

అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేస్తున్న భవానీలు, భక్తులకు దేవస్థానం ఉచిత ప్రసాదాలను వితరణ చేస్తోంది. తెల్లవారుజామున ఆరు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉచిత ప్రసాదాల వితరణ నిర్విరామంగా కొనసాగుతోంది. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు పులిహోర, దద్ధ్యోజనం భక్తులకు అందిస్తుండగా, పది గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్నప్రసాద వితరణ జరుగుతోంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పులిహోర, దద్ధ్యోజనం పంపిణీ చేస్తున్నారు. ఇక రాత్రి 7 గంటల నుంచి 11 గంటల వరకు టమాటా బాత్, దద్ధ్యోజనం అందిస్తున్నారు.

నేటి రద్దీపై సమీక్ష

భవానీ దీక్ష విరమణలు కీలక దశకు చేరుకున్నాయి. దీక్ష విరమణలలో తొలి మూడు రోజులు సుమారు రెండు లక్షల మంది భవానీలు విచ్చేయగా, నాల్గో రోజైన శనివారం లక్షన్నరకు పైగా భవానీలు విచ్చేస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం మోడల్ గెస్ట్ హౌస్‌లో సీపీ టీకే రాణా, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, ఇతర ముఖ్య అధికారులు శనివారం నాటి రద్దీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచే భవానీల తాకిడి పెరిగే అవకాశం ఉందని ఆలయ అధికారులు భావిస్తున్నారు. భవానీల రద్దీ ఏ విధంగా ఉన్నా వారికి అమ్మవారి దర్శనంతో పాటు ఇతర సదుపాయాల కల్పనలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని నిర్ణయించారు.

టీడీపీది దోపిడీ రాజకీయం

- అప్పుడు పింఛన్ కోసం ఎగబడే దుస్థితి
- ఇప్పుడు ఇంటికే నేరుగా నగదు పంపిణీ
- అద్దంకి సమన్వయకర్త హనిమిరెడ్డి

అద్దంకి: 'టీడీపీ ప్రభుత్వానిది దోపిడీ రాజకీయం.. అధికారంలో ఉన్నంత వరకూ ఏ విధంగా దోచుకున్నారో మనం చూశా'మని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి విమర్శించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నూతన పింఛన్ల పంపిణీ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు ఎంపీడీవో దేవసేన కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త హనిమిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ పాలనలో బ్రోకర్లదే రాజ్యమని చెప్పారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారిని ఏరిపారేసిందని తెలిపారు. అప్పట్లో ఏ పని కావాలన్నా జన్మభూమి కమిటీలే కీలకమని.. వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉండేదన్నారు. అప్పట్లో పింఛన్ కోసం అర్హులు ఎగబడే పరిస్థితి ఉండేదని, నేడు అది లేదని పేర్కొన్నారు. కుల,మత, వర్గ భేదం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. నేటి ప్రభుత్వంలో వలంటీరు ఇంటికే వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తున్నాడని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు కూడా లబ్ధిదారుడి ఖాతాకే జమ అవుతున్నాయని చెప్పారు.

మళ్లీ జగనన్నను సీఎం చేసి రుణం తీర్చుకోవాలి

సంక్షేమ పథక సారథిగా, మాట తప్పకుండా మడమ తిప్పకుండా అన్న మాట ప్రకారం పింఛన్‌ను అంచెలంచెలుగా రూ.3 వేలు చేసిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి 2024 ఎన్నికల్లో ఆయన్ను గెలిపించి రుణం తీర్చుకోవాలని సమన్వయకర్త హనిమిరెడ్డి సూచించారు. తనను కూడా అద్దంకిలో ఎమ్మెల్యేగా గెలిపిస్తే, అందరిలో ఒకరిగా, బిడ్డగా, కుటుంబంలో ఒకడిగా ఉంటానని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి మాట్లాడుతూ హనిమిరెడ్డిని అద్దంకి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పింఛన్ పెంచిన సందర్భంగా తొలుత సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరించారు. మండలంలో నూతనంగా మంజూరైన 83 కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, ధేనువకొండ సొసైటీ ప్రెసిడెంట్ రామిరెడ్డి ఆదిరెడ్డి, అవిశెన ప్రభాకర్‌రెడ్డి, జేసీఎం మండల కన్వీనర్ ఇస్తర్ల వెంకట్రావు, ఎంపీపీ అవిశెన జ్యోతి, నాయకులు, వలంటీర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త హనిమిరెడ్డి

యువత చూపు.. పుస్తకం వైపు

- వ్యక్తిత్వ వికాసం, పోటీ పరీక్షల పుస్తకాలకు డిమాండ్
- ఉపాధి అవకాశాల్లో రాణించేందుకు ఆసక్తి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): పుస్తక మహోత్సవంలో పలు సాహిత్యాలు అందుబాటులో ఉన్నా యువత లక్ష్యంగా ప్రచురించిన పుస్తకాలే అగ్రస్థానంలో నిలుస్తున్నాయి. పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కొనసాగుతున్న 34వ విజయవాడ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో సుమారు 200 స్టాల్స్‌లో విక్రయాలు జరుగుతుండగా అందులో దాదాపుగా ప్రతి స్టాల్‌లోనూ యువతకు సంబంధించినవే అధికంగా అమ్ముడవుతున్నాయి. ప్రచురణకర్తలు సైతం వారే లక్ష్యంగా అధికంగా పుస్తకాలను ముద్రించి మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు. దానికి తోడు ప్రస్తుతం విద్యార్థుల అవసరాలు, వారి ఉపాధి అవకాశాల్ని దృష్టిలో పెట్టుకుని వివిధ కోణాల్లో రచయితలతో కొత్త పుస్తకాలను రాయిస్తున్నారు.

ఆత్మవిశ్వాసం పెంపొందించే పుస్తకాలు


విద్యార్థులు ఎక్కువగా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే పుస్తకాలకు ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా సమయపాలన, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ఇంటార్వ్యూలను ఎదుర్కొవడం ఎలా? పోటీ పరీక్షలకు ఏఏ అంశాలను చదవాలి? అనే విషయాలను పుస్తకాల ద్వారా తెలుసుకునేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఆ దిశగా వారికి కావాల్సిన పుస్తకాలను విరివిగా కొనుగోలు చేస్తున్నారు.



సివిల్స్‌లో మెలకువల కోసం...

ప్రతి యువతీ లేదా యువకుడు సివిల్స్‌లో రాణించాలని కలలు కంటుంటారు. ప్రయత్నాలు ఆరంభిస్తారు. వారికోసం ఎన్నో వేల పుస్తకాలను ప్రచురణకర్తలు అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యంగా సీనియర్ ఐఏఎస్ అధికారుల అనుభవాల్ని జోడించి సివిల్స్‌లో రాణించేందుకు అవసరమైన సూచనలు చేస్తూ రచించిన పుస్తకాలు ఇక్కడ లభిస్తున్నాయి. సివిల్స్‌లో ఎటువంటి శిక్షణ తీసుకోకుండా వ్యక్తిగతంగా సమాయత్తం చేసేందుకు సీడీలు కూడా ఇటీవల లభిస్తున్నాయి. సివిల్స్‌కు సంబంధించినంత వరకూ ఎక్కువగా ఆంగ్ల సాహిత్యంలో పుస్తకాలు అధికంగా ఉన్నాయని స్టాల్స్ నిర్వాహకులు చెబుతున్నారు.

నాన్ ఫిక్షన్ పుస్తకాలు చాలా ఉన్నాయి



నాన్ ఫిక్షన్ పుస్తకాలంటే నాకు చాలా ఇష్టం. ఏటా వాటిని కొనుగోలు చేస్తాను. ఈ ఏడాది చాలా పుస్తకాలు కనిపించాయి. చాలా మంచి రచయితలు, ప్రముఖ సంస్థల పుస్తకాలు పుస్తక మహోత్సవంలో అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల పుస్తకాలు కొనుగోలు చేయటానికి ఇదొక ప్రత్యేక ప్రాంగణం. అందరికీ ఎంతో ఉపయోగంగా ఉంది.

– కె. సాయి విజయవాడ

క్లుప్తంగా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

రాజ్యసభ సభ్యుడు బాబుబాయ్ దేశాయ్

మేదరమెట్ల/యద్దనపూడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించే పథకాలను అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు బాబుబాయ్ దేశాయ్ అన్నారు. శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, యద్దనపూడి మండలంలోని పూనూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంలో ప్రజలకు పలు సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పథకాలను సక్రమంగా వినియోగించుకొని అభివృద్ధి బాటలో పయనించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ద్వారా అర్హత ఉన్న వారికి గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, సంకల్పయాత్ర ఇన్‌చార్జి రాంబాబు, జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కార్యదర్శి రామకృష్ణ, ఈవో శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు. పూనూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణకుమారి, ఎంపీపీ పులగం రజనీ, ఎంపీటీసీ సభ్యుడు వంకాయలపాటి సునీత, సర్పంచ్ మేకా సుధాకర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్యసేవల క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్ : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య ఆరోగ్య శాఖ అందుబాటులోకి తెచ్చిన మౌలిక సదుపాయాలు, అధునాతన వైద్య సేవల విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతృప్తి వ్యక్తంచేశారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. అర్బన్ పీహెచ్‌సీల్లోని వైద్య సేవలన్నింటిని పొందుపరుస్తూ 2024 సంవత్సరం టేబుల్ క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమన్నారు. శుక్రవారం గుంటూరు ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో హెల్త్ క్యాలెండర్ ను మంత్రి ఆవిష్కరించారు. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జవ్వాది విజయలక్ష్మి, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

నగరంపాలెం: గతేడాది తెనాలి పరిధిలో జరిగిన ఓ చోరీ/ దోపిడీ కేసులో నిందితునికి రెండేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ తెనాలి ఒకటో ఏజేసీజే కోర్టు జడ్జి తీర్పు వెలువరించారు. గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ శుక్రవారం అందించిన వివరాలు.. గతేడాది తెనాలి ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్(పీఎస్) పరిధిలోని ఓ ప్రాంతంలో చోరీ/దోపిడీ జరగ్గా, కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో తెనాలి రజక చెరువు అమ్మ ఆస్పత్రి సమీపంలో ఉంటున్న కోలా రత్నరాజుని సీఐ చంద్రశేఖర్ అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్‌కు పంపించగా, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ క్రమంలో సాక్షులను కోర్టులో హాజరుపర్చగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సునీల్‌కుమార్ ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. ఈ కేసులో గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా సమర్థంగా విచారణ నిర్వహించారు. సాక్ష్యాధారాలతో అతనిపై నేరం రుజువుకావడంతో శుక్రవారం తెనాలి ఒకటో ఏజేసీజే కోర్టు జడ్జి తీర్పు చెప్పారు. నిందితునికి శిక్షపడటంలో కీలకంగా వ్యవహరించిన సీఐ చంద్రశేఖర్, ఏపీపీ పి.సునీల్‌కుమార్, కోర్టు లైజన్ ఎస్ఐ శివప్రసాద్, తెనాలి ఒన్ టౌన్ కోర్టు కానిస్టేబుల్‌ను ఎస్పీ అభినందించారు.

మిర్చి యార్డు అభివృద్ధికి రూ.9 కోట్లు మంజూరు



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసిందని యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ తెలిపారు. నిధుల వినియోగంపై యార్డు అధికారులు, మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం సాయంత్రం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ రూ.60 లక్షలతో నూతన మరుగు దొడ్ల నిర్మాణం, రూ.95 లక్షలతో కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. రూ.2 కోట్లతో కృష్ణ నగర్ రైతు బజారు నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. మిగిలిన నిధులను రైతులకు ఉచిత అల్పాహారం, భోజనం, వసతి, మినరల్ వాటర్ ప్లాంట్‌లకు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. పనులకు తగిన రీతిలో ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కోరారు. మార్కెటింగ్ శాఖ చీఫ్ ఇంజినీరు శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శేషగిరిరావు, మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ జేడీ రాజశేఖర్, మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు, మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం దేశానికే మార్గదర్శి

- కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలు కొనసాగింపు
- పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి



పింఛను పంపిణీ చేస్తున్న ఆమంచి, తదితరులు

పర్చూరు (చినగంజాం): వృద్ధులకు, అవ్వతాతలకు ఇస్తున్న పింఛన్ రూ.3 వేలకు పెంచుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణ మోహన్ అన్నారు. శుక్రవారం పర్చూరు ఎంపీయూపీ పాఠశాలలో జరిగిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం వృద్ధులకు కేవలం రూ.వెయ్యి మాత్రమే పింఛన్ ఇచ్చిందని, ఎన్నికల ముందు మాత్రమే ఓట్ల కోసం పింఛన్‌ను రూ.2 వేలకు పెంచిందని విమర్శించారు. సీఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా పింఛన్లు దశలవారీగా రూ.3 వేలకు పెంచినట్లు వివరించారు. రాష్ట్రం అనేక ఇబ్బందుల్లో ఉన్నా పింఛన్లు ఆపలేదని తెలిపారు. కరోనా సమయంలో దేశంలోని అనేక రాష్ట్రాలు సంక్షేమ పథకాలు ఆపివేసినా ఏపీలో మాత్రమే వాటిని కొనసాగించారన్నారు. పింఛన్‌దారుల్లో ఎవరైనా చనిపోతే తప్ప టీడీపీ ప్రభుత్వం అర్హులైనవారికి పింఛన్లు ఇవ్వలేదని విమర్శించారు. నేడు పెరిగిన పింఛన్లతో అవ్వాతాతలు చాలా సంతోషంగా ఉన్నారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో 8,749 మంది లబ్ధిదారులకు నెలకు రూ.2.59 కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో పీ ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. 2004 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వం వృద్ధులకు కేవలం నెలకు రూ.50 లు పింఛను మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. అదికూడా ప్రతి నెల ఇవ్వకుండా జన్మభూమి కార్యక్రమాలు ఏర్పాటు చేసిన మూడు నెలలకొకసారి రూ.150 ఇచ్చేవారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం ఓట్లకోసం ఎన్నికలకు ముందు మాత్రమే పింఛన్లు పెంచటం, పసుపు, కుంకుమలను ఇవ్వడంలాంటి కార్యక్రమాలు చేసిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలన్నీ అమలు కావాలంటే జగన్‌కు మరోసారి మద్దతు పలకాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు కఠారి అప్పారావు, గోరంట్ల శివకుమారి, కోట హరిప్రసాద్, ముప్పాళ్ల రాఘవయ్య, తులసి నాగమణి, కోట శ్రీనివాసరావు, షేక్ అహ్మద్‌బాషా, షేక్ కాలేషా, గాదె సురేష్, ఆకుల హేమంత్, కంచెనపల్లి రమేష్, మల్లా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి గౌస్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో బీసీలకు తీరని అన్యాయం



ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు చంద్రబాబు అన్యాయం చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. శుక్రవారం రాత్రి తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి బీసీలకు రాష్ట్రంలో సముచిత స్థానం కల్పించి బీసీల అభ్యున్నతిని కోరారన్నారు. బీసీలకు చేసిన మేలు చూసి ఓర్వలేక ప్రతిపక్షనేత చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీసీలకు న్యాయం చేస్తామంటూ జయహో బీసీ సదస్సులు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీలకు చంద్రబాబు చేసిందేమీ లేదని, అది అందరికీ తెలుసునన్నారు. గత ప్రభుత్వంలో బీసీలకు ఏం మేలు చేశారో చెప్పాలన్నారు. వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూశారన్నారు. 2014–19 మధ్య కాలంలో బీసీలు తమ సమస్యలను పరిష్కరించాలని చంద్రబాబును కలిస్తే వారిని అవమానపరిచారన్నారు. జయహో బీసీ సదస్సు ఏర్పాటు చేసే హక్కు, అర్హత ఆయనకు లేదన్నారు. గత ప్రభుత్వంలో బీసీలకు ఒక్క రాజ్యసభ స్థానం కూడా ఇవ్వలేదన్నారు. రాజ్యసభ సీట్లన్నీ కార్పొరేట్లకే ఇచ్చారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఎమ్మెల్సీ పదవులను కూడా బీసీలకు తక్కువగా ఇచ్చారన్నారు. బీసీలకు ఐదు సంవత్సరాల కాలంలో రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తానని మేనిఫెస్టోలో పెట్టి ఆ వాగ్దానాన్ని తుంగలోకి తొక్కారన్నారు. కంటితుడుపు చర్యగా తుప్పు పట్టిన ఇస్త్రీ పెట్టెలు, కత్తెరలు ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీలకు రాజ్యాధికారం కల్పించి వారి అభ్యున్నతికి పాటుపడినది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. బీసీలకు చంద్రబాబు చేసిన అన్యాయాన్ని వారు మరిచిపోలేదన్నారు. ప్రజలంతా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నారని, మేలు చేసేవారికే తిరిగి పట్టం కడతారని అన్నారు.

మద్యం, నాటుసారా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా గత 10 రోజులుగా నిర్వహిస్తున్న దాడుల్లో మొత్తం 104 కేసుల్లో 107 మంది ముద్దాయిలను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.2.65 లక్షల విలువ గల మద్యాన్ని సీజ్ చేయటం జరిగిందన్నారు. అక్రమ మద్యం, నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడినా, నిల్వ చేసినా అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాటు సారా తయారీ, నిల్వ చేసిన స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించి మొత్తం 26 కేసులలో 38 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని 5,640 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. అడవులదీవి పోలీస్ స్టేషన్ పరిధిలోని జంపని గ్రామ సమీపంలోని అడవులలో నాటు సారా తయారీ బట్టీలపై మెరుపు దాడులు నిర్వహించి 340 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. తరచుగా పోలీస్ అధికారులు, సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తూ అనుమానిత ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారన్నారు. అక్రమ మద్యం, నాటుసారా క్రయ విక్రయలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బస్సు ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



మృతురాలి కుమారుడికి నగదు చెక్కును అందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: విజయవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన బస్సు ప్రమాద దుర్ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నగదు విడుదలైందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. ఇటీవల విజయవాడ ఆర్టీసీ బస్టాండ్ లో జరిగిన ప్రమాదంలో జిల్లాకు చెందిన ఇరువురు వ్యక్తులు మృతి చెందారన్నారు. ఆ కుటుంబాలకు రూ.20 లక్షల నగదును మంజూరు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో నగదును కలెక్టర్ అందజేశారు. చీరాలకు చెందిన 45 ఏళ్ల మౌటాని కుమారి మృతి చెందగా ఆమె కుమారుడు మౌటాని కిషోర్ బాబుకు రూ.10 లక్షల నగదును అందించారు. అలాగే జె పంగులూరు మండలానికి చెందిన ఏడు నెలల కాటీ అహన్ మృతి చెందగా తల్లి ఝాన్సీ రాణికి రూ.10 లక్షల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కె.గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

డీఈవో పీవీజే రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రామారావు

చెరుకుపల్లి: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధించాలని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు అన్నారు. మండలంలోని గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చెరుకుపల్లి, పిట్లవాని పాలెం, నగరం, నిజాంపట్నం, భట్టిప్రోలు, రేపల్లె, మండలాల్లోని నాడు–నేడు పనులు జరుగుతున్న పాఠశాలల హెచ్‌ఎంలు, ఆయా మండలాల ఎంఈవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులను వారి వారి సామర్థ్యాన్ని బట్టి గ్రేడులు గా విభజించి వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలన్నారు. వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి మెరుగు పరచాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులు ఏ దశలో ఉన్నాయో పాఠశాలల వారీగా అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో డీవీఎస్ శ్రీనివాసరావు, ఏఎస్‌వో సంజీవ్, ఎంఈవోలు టి.నవీన్‌కుమార్, పులి లాజర్, హరిబాబు, కె.సురేష్, వెంకటేశ్వరరావు, శేషుబాబు, దేవరాజు, పాఠశాల హెచ్‌ఎం కవిత, విద్యాకమిటీ చైర్మన్ మంచాల విజయ్‌కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఉపకార వేతన పంపిణీ

- 300 మంది విద్యార్థులకు రూ.50 లక్షలు అందజేత
- సొసైటీ చైర్మన్ కె.బసవపున్నయ్య



మాట్లాడుతున్న డాక్టర్ బసవపున్నయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.50 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు సొసైటీ చైర్మన్ డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య తెలిపారు. శుక్రవారం జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలోని కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో బసవపున్నయ్య మాట్లాడుతూ పేద, ప్రతిభ కలిగిన అన్ని సామాజిక వర్గాలకు చెంది, ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు కొంత వరకైనా సహాయం అందించాలనే ఆశయంతో 2003లో సొసైటీని ప్రారంభించినట్లు చెప్పారు. అమెరికాలో స్థిరపడిన డాక్టర్ జాస్తి వెంకటేశ్వర్లు, డాక్టర్ కొల్లి రాధాకృష్ణమూర్తి, కొడాలి రాజవీరయ్య, బొప్పన ద్వారకా ప్రసాద్, కెనడాలో స్థిరపడిన డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావు, గుంటూరుకు చెందిన డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, డాక్టర్ యడ్లపల్లి లక్ష్మణస్వామితోపాటు పారిశ్రామికవేత్తలు కర్నాటి వెంకటేశ్వరరావు, నాట్కో ఫార్మా ముఖ్య దాతలుగా మరి కొంతమంది ఎన్నారైల సహకారంతో వారి ఇచ్చిన, ఇస్తున్న విరాళాలతో 20 ఏళ్లుగా ప్రతి యేటా రూ.35లక్షలకు తగ్గకుండా విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 7న కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న 21వ ఉపకార వేతన పంపిణీ కార్యక్రమంలో భాగంగా డిగ్రీ, పీజీ చదువుతున్న 300 మంది విద్యార్థులకు రూ.50 లక్షలు చెక్కుల రూపంలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు. సొసైటీకి రూ.కోటి విరాళాన్ని అందజేసిన డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావు మాట్లాడుతూ డాక్టర్ జాస్తి వెంకటేశ్వర్లు ప్రోత్సాహంతో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలనే ఆశయంతో తాము సొసైటీని స్థాపించినట్లు చెప్పారు. ఎంపికలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వడ్లమూడి గోవర్ధనరావు, నామినేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ

గుంటూరుమెడికల్: కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కులమతాలకతీతంగా ప్రతిభగల పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ జనవరి 7న జరుగుతుందని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఇ.వి.నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19 సంవత్సరాల కిందట ప్రారంభమైన ఈ ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకు తెలుగు రెండు రాష్ట్రాల్లోని 6000 మందికిపైగా ప్రతిభగల విద్యార్థులకు రూ.1.09 కోట్లు ఉపకార వేతనంగా అందజేశామన్నారు. ఈ ఏడాది 500 మంది విద్యార్థులకు రూ.20 లక్షలు అందజేస్తామని తెలిపారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ శివారు కౌండిన్యనగర్‌లోగల కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో ఆదివారం ఉదయం 8గంటలకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, అతిథులుగా వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత అదనపు కమిషనర్ వై సత్యనారాయణ, ఆదాయపన్ను శాఖ విశ్రాంత ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ బి .వెంకటగోపినాథ్, విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా, టుబాకో బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, రోటరీ మాంక్ డాక్టర్ వడ్డమాని రవి, ఆడిటర్ నందూరి ఆనంద్‌కృష్ణ పాల్గొంటారన్నారు.

సెంట్రల్ జోన్ పోటీలో కృష్ణా జట్టు విజయం

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఆంధ్ర సెంట్రల్ జోన్ అండర్–14 బాలుర అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ పోటీలో భాగంగా శుక్రవారం కృష్ణా, గుంటూరు జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో కృష్ణాజిల్లా జట్టు 41 పరుగుల తేడాతో గుంటూరు జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన గుంటూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని పరంధామ్ 32, రణధీర్ 31పరుగులు చేయగా, గుంటూరు బౌలర్లు గోపీచంద్ 4, డేవిడ్‌మెలి ప్స్ 2వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 145 పరుగులు చేసి ఓటమిపాలైంది. జట్టులోని అభినవ్ డేవిడ్ 36, డింకు 26పరుగులు చేయగా, కృష్ణా బౌలర్ సంజయ్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, ఏసీఏ రాష్ట్ర జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యుడు కోటారెడ్డి, డి.రమేష్ కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం గురప్పనాయుడుపాలెం గ్రామంలో టీడీపీకి నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన 150 కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ టీడీపీ కంచుకోట అని చెప్పుకునే గురప్పనాయుడుపాలెం గ్రామంలో ఇలా భారీఎత్తున వైఎస్సార్ సీపీలో చేరడం పార్టీ గెలుపునకు సంకేతమన్నారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నా ఎస్సీలు, నా ఎస్టీలు అని ఎంతో ప్రేమతో దగ్గర తీసుకొని రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించారన్నారు. రానున్న రోజుల్లో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అణగారిన వర్గాలకు అండగా బ్రహ్మనాయుడు ఉన్నాడని చిన్నచూపు చేసేవారందరూ గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. పార్టీలో చేరిన వారిపై ఎవరైనా దుశ్చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామోదయం, నవోదయం పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపించండి

నరసరావుపేట: జిల్లాలో వినూత్నంగా చేపట్టిన గ్రామోదయం, నవోదయం కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారులు గుర్తించిన పనులపై తగిన ఉత్తర్వులు జారీచేసి త్వరితంగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలువురు మండల ప్రత్యేక అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారు గుర్తించిన అంశాలను వివరించారు. ప్రధానంగా గడపగడపకు మన ప్రభుత్వం, దివ్యాంగుల ఓటరు నమోదు, బంగారు తల్లి వంటి కార్యక్రమాలపై సమీక్షించారు. ఐవోసీఎల్ ద్వారా సీఎస్ ఫండ్స్ క్రింద కోటి రూపాయల విలువ చేసే చిన్న పిల్లల క్రీడా పరికరాలను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సుమారు ఎనభై వేల ఖరీదు చేసే పరికరాలను అంగన్‌వాడీ కేంద్రాలలో ఉంచే విధంగా ప్రో–అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించాలన్నారు. మండల పరిషత్ అధికారులు, విద్యాశాఖాధికారులు, ఐసీడీఎస్ అధికారులు కలసి ప్రో–అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించాలన్నారు.